


# "నెలగంటు"

కోడి కూతకూసింది. తెల్లవారలేదు. చిన్న చలి గాలి అప్పుడప్పుడే తగుల్తూంది... రామి సీతిగాణ్ణి పొదివిపట్టుకొని పచ్చడం ఇద్దరిమీదికీ లాక్కుంది వెచ్చగా.

"లేయే అమ్మీ! ముందల కోతలెట్టుక పల్లిక తొంగున్నావ్" అని గదమాయించింది పారమ్మ. తుళిక్కిపడి లేచింది రామి.

"ఏటైందిరా! తేలు కుట్టినట్టెగురుతున్నావు" అంది పారమ్మ— నాయుడు లేచి ఒక పచ్చడం కప్పుకొని "సలేత్తుందే!" అన్నాడు పిల్లలు చూడకుండా కన్నుగీటుతూ!

"ఎయ్యిదామరి కోతలదాకా పన్నేదు. కమ్మ క్కూకుండి సుట్టపొగేసుకుంటే సరి" అంది విగడంగా.

"బాగానెప్పినావ్! మెచ్చినీకు మెడ విరగెయ్యాలి. రాతిరి సగం కాల్సిన సుట్టిలా బట్టుకురా!" అని ఆజ్ఞాపించాడు. చుట్టముట్టించి, రెండు బుక్క పొగపీల్చి నాయుడి కందిచ్చింది.

"ఆ బోరిగిలా పారేయ్ నీకు లిప్పుకొస్తా కర వాటిసారి"

"అందిచోచ్చెట్టుంటే అన్నీ కావాలి" అంటూ నవ్వుతూ అందించింది బోరిగి.

"అమ్మీ! మళ్ళా కునుకుతీస్తున్నావా?" అని ఉరిమీసరికి ఒక్కచంగులో బయటికి లేచింది రామి. వెనకాలే లేచాడు సీతిగాడు. ఒంటిమీద నక్షత్రమంత గుడ్డన్నా లేదు. అప్పవెనకాలే అన్నిటికీని, నడ్డిచుట్టూ తిప్పుగోచీ చాలీచాలని కబ్బా తొడుక్కుని సుమ్మగుడ్డ నెత్తినిపెట్టుకుని కుండ దానిమీద ఓరు వంపుగాపెట్టుకు విడిచేతు లాడించుకుంటూ, బయలుదేరింది చరూకి. ఎవ్వరూ చెప్పక్కరలే నీళ్లు తెమ్మని!

"రారయ్యా! సాక్కా తొడుగుతాను, సకెయ్యనేదురా!" అన్న పారమ్మమాట ఎవరికో అన్నట్లు వెళ్ళిపోయాడు రామి వెంకాల.

"ముండ పోకలు సెప్పలేనగు!" అనుకుంటూ కళ్ళాపు చల్లడానికి పేడకోసం ఆవులసాల్లోకి వెళ్ళింది పారమ్మ.

చుట్టపొగ తమాషాగా వదల్తూ చీకటి వెలుగుల మధ్య పగటి కలల్లో పడ్డాడు నాయుడు పొలం వంకపోతూ!... కోనేరు గట్టు ఎక్కుతూంటే, ఆనందమైంది నాయుడి మనస్సుకి... చెట్లచాటునుంచి లేతకిరణాలతో కోనేరులో పద్మాలకి గిలిగింతలు పెడుతున్నాడు సూర్యభగవానుడు. గడ్డిమీద రాత్రి కురిసిన మంచుబిందువులు మంచిముత్యాల్లా మెరుస్తున్నాయి. కోనేరు కిరువైపులా యీనిన చేలు కన్నులపండువుగా ఉన్నాయి. భావిసుఖముల నాలోచిస్తూ తలవంచుకున్న పెండ్లికూతురు జ్ఞాపకం వచ్చింది నాయుడికి పంటచేల మొగ్గు చూస్తూ ఉంటే!... చాలా కాలానికి అన్ని పొలాలూ కరువు తీరినట్లు పండాయి.

పారమ్మ కాపరానికి రావడం జ్ఞాపకం వచ్చింది. ఆ ఏడు కూడా పంట బాగా వుంది. వానల సమయానికి పొద్దులు... ఇంటిమీద గడ్డి కర్ర కలచనగా ఉంది. ఉడుపుల హడావుడి ఎన్ని కష్టాలైనా ఓర్చింది పాపం. పంట కూడా

"గోపి"

మెరుగుగా పండింది. ఇటిక గోడలతో మిద్దిల్లు లేచింది. అందుకే రామిని చూస్తే నాయుడికి చాలా ముద్దు. పొలంనుంచి ఇంటికి వస్తూనే "రాంయీ" అంటూ పిలిచి ఎత్తుకుంటాడు.

"ఎద్దున్నా పదేళ్ళొచ్చినాయ్ ఇంకా ఎత్తుకోడమేనా నలుగురూ ఆడగొస్తున్నారు కదా" పారమ్మ అంటే, నాయుడి హృదయం తీరని భారంతో నిండిపోతుంది. ఆరేళ్లు కలుగలుపుగా గడిచిపోయాయి. "దాని మాటా నిజమే, ఆడగొచ్చినప్పుడే ముడెయ్యాలి తరువాతేం లాభం" అనుకున్నాడు.

"అన్నీ పైసలా చెయ్యాలి. పదేళ్ళపొద్దైంది ఒక సిలుకుచీర కొన్నేకున్నాను. ఈ ఏడు అమ్మి వెళ్ళి, ఇంటిదాయికి కోక తప్పక్కొనా" లనుకున్నాడు. "ఇహ ఇంటిమీద పెంకువెయ్యడం మిగుల్తాది...ఏమో నాలుగు పైసాలు మిగల కూడదా!" అని గాల్లో మేడలు కట్టుకుంటూ నడిచాడు.

కోనేరుగట్టు దిగుతూంటే గుండె గబగబా కొట్టుకుంది. పంట మొగ్గమాచి, అడిగినవాళ్లంతా అవుసరానికి అప్పిచ్చారు. అందరికీ ధాన్యాలు ఇవ్వాలి అడ్డకి పడ్డా. ఇది ప్రతిసంవత్సరం నాయుడికి తీరనివ్యథ. "ఎంతకష్టపడ్డా చేతికి, నోటికికూడా పట్టని ఆదాయం" అనుకున్నాడు.

చల్లంది వేళకి ముందుగానే పొలం చేరుకున్నాడు. కాని రాత్రికట్టిన ఎదువుమడిలో నీరు లేదు, రౌద్రమూర్తైయ్యాడు. "ఏడికిరా ఇన్ని గుండెలు నానుకట్టుకున్న నీరు తిప్పుకోడానికి" అంటూ బుసకొడుతూ ఈరడికోసం ఎదురుమాస్తున్నాడు...కోపంలో ఈరడు దగ్గరకొచ్చేదాకా గుర్తుపట్టలేదు.

"నాయుడిబావకి కోపం గవల నన్ను సూడకుండున్నాడు" అన్నాడు ఈరడు వెకిలినవ్వు నవ్వుతూ!

తొకతొక్కిన త్రాచులా చర్రున లేచాడు నాయుడు, "ఏటోస్ ఈపూట నువ్వుకట్టుకుంటే పోనేదా? మీద మడినున్న గొండిపోనాది రాతిరిల్లు రవంత ఎక్కతాదని తిప్పినాను. ఏటిబావా, ఈమాత్రంకేనా కోపం? కావాలంటే రెండు కొట్టు" అని బుర్ర వంచాడు.

సమయానికి ఉతికిన చీరకట్టుకో మెట్టుముడుచుకో చక్కగా చలిదికుండ నెత్తిని పెట్టుకో పారమ్మ రాకపోతే ఈరడి రక్తం చూచి ఉండేవాడు నాయుడు.

"ఏటి మావా బుసకొడుతున్నావ్?" అడిగింది పారమ్మ.

"ఏటా? సూడు: రాతిరి నానుకట్టిన నీరును తిప్పుకున్నాడు." అని కడుపులో మంట వెళ్ళకక్కాడు.

"ఒగ్గేయ్! నీముందాడేటి నిలపడతాడు పోన్లె మావా. ఒకరోజు ఎక్కువ, అంతేనా?" అంది లాలనగా. మనసులో నాయుడి కండబలానికి గర్విస్తూ.

"ఇంకేటి సేత్తావు ఇంటికి పద" అని లాక్కెళ్ళింది ఈ వూసు ఆ వూసు చెబుతూ! ఏవేవో ప్లేన్లు వేసేస్తున్నారు. పంట మోకరంగా ఉంటే రైతుకి ప్లాన్లే ఉండవా?

* * *

నీరెండలో రావిచెట్టు కింద మంచం వేసుకో పడుక్కున్నాడు, ఉడుకునీళ్ళ కెదురుచూస్తూ. కోతలవాళ్ళతో సరి. రెండ్రోజులెండేనాక కుప్పలువేస్తే మళ్ళా పండుగ దాటేదాకా నూర్చక్కరలేదు. కిద్దికి మాత్రం నాలుకుప్పట్లు నూరిస్తే చాలు అని అనుకుంటూ, నీళ్ళకోసం తొందర చేద్దామని ఇంట్లో కెళ్ళాడు.

"ఏమే? ఉడుకునీళ్లు?" అని అడిగాడు.

బిత్తరపోయిన ముఖంతో "సూడు మావా నెలగంటు నాడే రావాలా ముండావూష్టం" అని మరిగిపోస్తూన్న రామివళ్ళును తాకించింది.

"పిచ్చిదానా! రవంత ఎచ్చగుంటె గాబరావా? వైదిణ్ణిప్పుడే పిలుత్తా"నంటూ నించున్నపాళంగా బయలుదేరాడు. వైద్యుడు సక్యం అనుపానం చెప్పి మందిచ్చిపోయాడు. రాత్రల్లా ఉష్ణం జోరుగా కాసింది. సీతిగాడు అప్పపక్కలో పడుక్కుంటానని మారాం పెట్టాడు. ఎలాగో తెల్లవారింది.

ప్రకాశం స్నానం ధ్యానం చేసుకుని, వీబూది పెండికట్లు, మడి ధోవతితో పచారు చేస్తున్నాడు వరండామీద. ఒగర్చుకుంటూ వచ్చి "దణ్ణాలు బుగతా" అని ఎదురుగా నిలపడ్డాడు నాయుడు.

"నాయుడుగారు కనబడ్డమే మానేశారు. ఏం గడ్డి కర్ర లకుపతానననా?" అన్నాడు వికటంగా ప్రకాశం.

"నీకెప్పుడన్నా చేదన్నానా బుగతా?... అమ్మికి పూరంత ఉష్ణంవచ్చింది నిన్న. నెలగంటు నాడు వచ్చిందని, వేగిపోతున్నాది ఇంటిదాయి. ఏటీ తోసటుండా వుంది. ఏటి చెయ్యమంటావో సెప్పు బుగతా?" అని కడుపులో బాధ కక్కేడు.

"అలా చెప్పావ్. ఏమీ ఇంత పొద్దున్నే నాయుడు వచ్చాడనుకున్నా...సరే సీసాతీసుకు గవర్నమెంటు హాస్పిటల్‌కి రా, డాక్టరుతో మాట్లాడుతాను" అని చెప్పాడు.

"మంచొచ్చినా సెబ్బరొచ్చినా నీ కాడికి రాక ఎక్కడికిపోయను బుగతా" అంటూ దణ్ణాలు పెడ్తూ వెళ్లిపోయూ డింటికి సీసాకోసం. నాయుడి గుండె జారిపోయాయి. గవర్నమెంటు ఆసుపత్రికి రాగానే. ఎటుమాదినా రోగులే! "ధరమదాత ఎంతమందికి పాణం పోసేడో!" అన్న మాటలు కొంచం పూరటనిచ్చాయి.

డాక్టరుగారి ఎదురు కుర్చీలో కూర్చున్నాడు ప్రకాశం. పిల్లిలా నిలబడ్డాడు నాయుడు.

ప్రకాశం నాయుడిని డాక్టరుకి పరిచయం చేసేడు "మోతుబరీరైతు, బంగారం పిచ్చుక" అన్న పదాలు దొర్లిస్తూ!

"ఆఫీసునుంచి పోయేటప్పుడు చూస్తానులే!" అని గుర్తుగా వ్రాసుకొన్నాడు డాక్టరు...ఇచ్చిన ఎర్రమందు పుచ్చుకో, ఇల్లు చేరేసరికి పన్నెండు గంటలుకొట్టేరుదగ్గర చర్చిలో.

నెలగంటునాడు రావడం, ఉష్ణం రెండు రోజులనుంచీ విడవకపోడం నీలాటి రేవుకి తెలిసింది. నీళ్ళ కడవ గడపలో పెట్టి, "ఏటో లప్ప అమ్మికి ఉష్ణమొచ్చిందిట నిన్న రేవు కాడ కనబడక పోతే ఏటో అనుకున్నాము" అని ఒక్కొక్కరే పరామర్శ ప్రారంభించారు.. నెలగంటు నాడు వచ్చిన ఉష్ణం ఎంత చెడ్డదో ఎంతమందిని ఎప్పుడెప్పుడు పొట్టెట్టుకుందో, ఊసులు వేసుకోడం నాయుడునీ పారమ్మనీ కలవరపెట్టాయి.

పూరికొంప, ఎదురుగుండా పశువులసాల. పెరట్లో మునికినాళా ... ఇరుకు సందులోంచి డాక్టరువచ్చి రామిని తణిఖీ చేశాడు. "ఇది విష జ్వరంలా కనపడుతూంది. ఇక్కడుంటే కష్టం ఆసుపత్రిలో వెయ్యండి" అని డాక్టరుబాబు సలహా ఇచ్చాడు. చొప్పదంటు ప్రశ్నలకి సమాధానం చెప్పకుండా, జటకావైపు చరచరా నడిచి పోయాడు. జట్కావాడు ఎనిమిదణాలూ అద్దె వసూలు చేశాడు. వార్డుబోయ్ పేదోడివి కనక మూడు రూపాయలంటూ విజిటింగ్ ఫీజ్ వసూలు చేశాడు. "ధరమాత్ముడు గర్వంలేదు." అనుకున్నారు ఇవి చూడని జనం.

మరో రోజుకూడా ఇంటిదగ్గర ఉండటాన్న విశ్రాంతిలేక, జ్వరంతోపాటు కలవరింతకూడా ప్రారంభించింది రామి-రాత్రి గుడ్డివెన్నెలలో మోరలెత్తుకో నాయుడి ఇంటిముందు కుక్కలు మొరగడం, అసలే అపశకునాలతో హడలిపోతూన్న దంపతుల మనస్సు మరీ కలత బారింది.

"డాక్టరు బాబూ! అమ్మిని పెంచినా చంపినా నీదే బారం" అని అప్పన్న డాక్టరు కాళ్ళు పట్టుకున్నాడు. రామి అణకువ కష్టపాటు తనం అభిమానం, కథల్లా చెప్తూకు "బతికే పిల్లల కుండే లచ్చనాలా?" అన్నది పారమ్మ ఎందుకలా అంటూరో వాళ్లకే తెలీదు! డాక్టరు వార్డుబోయిని పక్కగా పిలిచి చెవి కొరికాడు. వార్డుబోయ్ నాయుడికేదో చెప్పాడు రహస్యంగా నాయుడి ముఖం వాడిపోయింది "సరే" అన్నాడు కష్టం మీద, "సరే అంటే లాభంలేదు సాయంకాలానికి సద్దుచెయ్యాలి" అని చెప్పి ఆసుపత్రిలో చేర్చమని వెళ్ళిపోయాడు.

బండీ కట్టించి హాస్పిటలుకి రామిని తీసుకెళ్ళారు. సాయంకాలానికి విరోచనాలు ప్రారంభించాయి. డాక్టరు మాత్రం కంటికి రెప్పలా కాపాడుతూవచ్చాడు, మందుమీద మందు ఫిరాయిస్తూ మన్నాడు ఏదో కొత్తమందు పట్టణం నుంచి తెచ్చివేశానన్నాడు. చేత్తో తీసినట్లు తగ్గిపోయింది ఉష్ణం అంతాకూడా "ఏంతమాట" అని ముక్కుమీద వేలు వేసుకున్నారు.

నాలుగురోజుల్లో బాగా తగ్గగానే ప్రాణం లేనివానికి ప్రాణం పోశాడని లోకానికిచాటారు నాయుడు పారమ్మ ఇరవై ఒకటోరోజున హాస్పిటలునుంచి వదుల్తూ "నెలపూర్తిగా విశ్రాంతి

ఉండాలని, వీలైతే గాలి మార్పుకి సముద్రతీరానికి తీసుకెళ్ళమని పాలు, పళ్లు బాగా ఇవ్వాలని పరిసరాలు శుభ్రంగా ఉండాలని, బట్టలు శుభ్రంగా ఉతుక్కోవాలని నల్లులు పేలూ, దోమలు ఈగలు రోగాలకి కారణమని" ఎన్నెన్నో చెప్పి పంపించాడు డాక్టరు.

ప్రకాశం కంతులు పలకరించాడు "ఏం నాయుడూ! పిల్లని నిమ్మళించింది. నూర్పులు ప్రారంభిస్తావు కామోసు, గడ్డి కర్రలు సంగతి మరిచిపోకేం" అని హెచ్చరించాడు.

"హామ్మ ఎంతమాటన్నారు" అంటూ నూర్పుల హడావుడిలో పడ్డాడు.

"ఈరబావా ఓచెయి సాయం చెయ్యవా!" అని అడిగాడు నాయుడు.

"దానికేం నేరా! సమయానికి ఆదుకోకపోతే ఎందుకీ జలమ్మ" అని భరవసా ఇచ్చాడు ఈరన్న.

"బావా! అడుగుతాను కోంబడవుకద! ఆసుపత్రికెంతైంది" అని అడిగాడు.

"నాలుగొందలైంది; మందుకీ పత్తేనికీ. బాబుకి మాత్రం ఒక పాతికరూపాయిలిచ్చి రచ్చించమని కాళ్లు పట్టుకున్నాను. మారాజ నోరెత్తనేదు" అని జమాఖర్చులు చెప్పాడు.

"ఏటోరా ఆసుపత్రోళ్లు ఇంతది అంత అంతది ఇంత చేస్తారని" కమెంటిచ్చాడు ఈరన్న.

నూర్పులైయ్యాయి. మర్నాటినుంచీ చేబదుళ్ల వాళ్ళు, తాకట్లవాళ్లు అంతా తొందర చేశారు. ఆడ్డకి పడ్డా అమ్మగా అప్పులుతీరి తిండిగింజలు మిగిలాయి. కళ్ళంలోంచి ఇంటికిపోతూ "ఏటో ఈడిమాయ. ఒకసేత్తో ఇత్తాడు రెండోసేత్తో నాక్కుంటాడు!"

"అమ్మి పెళ్ళి నేదు, ఇంటి దాయక్కా నేదు. ఇంటిమీద గడ్డి కర్రలు మారుస్తేచాలు. పెంకు మాట పెరుమాళ్ళకెరుక-పంట నోటులేదు. మహాతల్లి సిరునవ్వ నవ్వింది. కాని శనేశ్వరుడు తిన్నగా నేడు... పోనీ పెసలున్నాయి కాదా మూణ్ణెల్లలో" అని తృప్తిపడ్డాడు.

"అయ్యా! అయ్యా! సీతడికి చేపి కరిసింది. అమ్మ బేగి పార్రమ్మంది" అన్న రామి పలుకులు ములుకుల్లా గుచ్చుకున్నాయి.

"ఓరి భగవంతుడా! ఇంకా పరీచ్ఛ చెయ్యాలా?" అనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

# గతజీవుల అడుగుల జాడలు

వజ్రపాణి

గతజీవుల అడుగుల జాడలు,
గతానేక ప్రాణుల నీడలు,—
నిత్యజీవిత వైవిధ్య సంఘర్షణలో
సత్యాసత్య నేపథ్య సంగీతంలో
బాధగా చెమటోడ్చి
బరువుగా నిట్టూర్చి
"తత్త్వమ"స్యాది లక్ష్యాల తాలూకు
తత్వాలను గ్రహించలేక...
ఈ లోకపు పాకడలో
ఈ చీకటి కూకటిలో—
ప్రాకులాడి-మృత్యు విషాన్నం
అరగించుకోలేక అవసన్నములైనవి!
ఉపనిషదర్వాచీన
వ్యాఖ్యాన పథాలలోన
అడుగడుగున అడ్డుతగిలిన
అగ్నిపర్వతాల "లావా" ద్రవంలో
కరిగిపోయి, సురిగిపోయిన
నరమానవుని "ఎముక"లో—
అహంకార మదృశ్యమై
సోహంపల్లవి మేళవించింది
సోహం దేహమైన నాడు
మోహానికి మూర్ధాభిషేకమైననాడు
నరమానవుని నరనరాలలో
అహంకారం ఆక్రోశించింది!